క్లుప్తంగా

రోడ్డుపై కొండచిలువ సంచారం



శాయంపేట : మండలంలోని మాందారిపేట నుంచి శాయంపేటకు వెళ్లే రోడ్డుపై గురువారం రాత్రి కొండచిలువ సంచారం పలువురిని భయాందోళనకు గురిచేసింది. దీంతో ఆటుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు సెల్‌ఫోన్‌లో ఫోటోలు, వీడియో తీశారు.

సన్మానం

నల్లబెల్లి : ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా నర్సింహమూర్తిని సతీసమేతంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నర్సింహమూర్తిని ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలకుపైగా విధులు నిర్వర్తించారని తెలిపారు. తొలుత నర్సింహమూర్తి అతడి తల్లికి పాదాభివందనం చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఊడుగుల సునీత, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ అబిద్ అలీ, ఎంపీఓ రవి, ఎంఈఓ అనురాధ, ఏపీఓ వెంకట్‌నారాయణ, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

నర్సంపేట : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల సౌజన్యంతో కనెక్టిట్యూడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోగుల సృజన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. సుమారు 10 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు 256 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 124 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రమేశ్ నాయక్, కంపెనీ ప్రతినిధి హెచ్‌ఆర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఆవుల చంద్రయ్యను అతడి తల్లి సోమక్క ఇటీవల మృతి చెందిన క్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. తొలుత సోమక్క చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు తిరుమల్, మాదాటి శ్రీనివాస్, నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరిప్రసాద్, శివకుమార్, వేణుగోపాల్, భీమ్‌రావు, రాజు, సూర్య, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట మండలంలో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్‌తండాకు చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు భానోత్ గణేశ్ అనారోగ్యానికి గురి కాగా అతడిని, ధర్మాతండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భూక్య బాలు తల్లి వాలీ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని, పాపయ్యపేటకు చెందిన మండల ప్రధాన కార్యదర్శి భూక్య రవీందర్‌నాయక్‌ను అతడి సోదరుడు ఈర్యనాయక్ ఇటీవల మృతి చెందిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. పెద్ది వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తినాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కొండవీటి ప్రదీప్‌కుమార్, అమ్మ రాజేశ్, మాజీ సర్పంచ్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి తాజా మాజీ సర్పంచ్ కూస సమత భర్త రాజు (45) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, తదితరులు నివాళులర్పించారు.

4వ వార్డులో..

నర్సంపేట : పట్టణంలోని 4వ వార్డుకు చెందిన ఆలకుంట మల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర సభ్యుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మనోహర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, పట్టణ ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, శివరాత్రి స్వామి, 4వ వార్డు అధ్యక్షుడు సంపంగి సాలయ్య, పట్టణ యువజన నాయకులు దొమ్మటి సంతోశ్, రాపోలు రాములు, రాపోలు రవి, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా తీరని కష్టాలు..



కంకర తేలిన పున్నేలు-పెరుమాండ్లగూడెం బీటీ రోడ్డు



కల్వర్టు నిర్మాణానికి రోడ్డు పక్కన ఉంచిన సిమెంట్ పైపులు

- రూ.2.1కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందుల్లో పెరుమాండ్లగూడెం, పున్నేలు గ్రామస్తులు

ఐనవోలు : రెండు గ్రామాలను అనుసంధానం చేసే బీటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పున్నేలు నుంచి పెరుమాండ్లగూడెం వయా వడ్డెరగూడెం నడుమ సుమారు 2.5కిలోమీటర్ల బీటీరోడ్డు గత ప్రభుత్వ హయాంలో మంజూరైంది. 2021-2022 సీఆర్ఆర్ నిధులు రూ.2.1కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన పీఆర్ బీటీ రోడ్డు పనులను అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొదట్లో హడావిడిగా ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకర పోసి పలుచోట్ల కల్వర్టుల నిర్మాణానికి పైపులు తెప్పించారు. కొన్ని చోట్ల పైపులు వేసి మరికొన్ని చోట్ల వృథాగా వదిలేశారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. దీంతో తొలివిడత బిల్లు రాలేదనే సాకుతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేసినట్లు విమర్శలు వస్తున్నాయి. కాగా ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, రైతులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవడంతో వాహనదారులు గాయపడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఈ మార్గంలో కంకర కుప్పలు, కల్వర్టుల కోసం తెచ్చిన పైప్‌లు రోడ్డుపైనే ఉండటంతో రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి



పున్నేలు నుంచి పెరుమాండ్ల గూడెనికి వెళ్లే దారిలో నాకు ఎకరం పొలం ఉంది. బీటీ రోడ్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభంకాగా సంతోషించాను. కానీ రోడ్డు పనులు మున్నాళ్ల ముచ్చటగా మధ్యలోనే ఆగిపోతుందని అనుకోలేదు. రైతులు ఎరువులు, కూలి పనులకు వెళ్లేందుకు ద్విచక్రవాహనాలు కూడా వెళ్లేందుకు వీలులేదు.

- చాట్ల వెంకటనర్సు, రైతు, పున్నేలు

నాయకులకు చిత్తశుద్ధి లేదు



పున్నేలు, పెరుమాండ్లగూడెనికి చెందిన నాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే బీటీ రోడ్డు పనులు మధ్యలో ఆగిపోయాయి. నాకు ఈ మార్గంలో 3 ఎకరాల పొలం ఉంది. ఎరువులు, పంట రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అధికార పార్టీకి చెందిన నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలి.

- అడుప శంకర్, రైతు, పున్నేలు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రైతులు, ప్రజల ఆకాంక్ష మేరకు బీటీ రోడ్డు మంజూరు చేయించి 2022లోనే కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభింపజేశాం. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతోనే రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా స్థానిక ఎమ్మెల్యే కృషిచేయాలి. పనులను వెంటనే పూర్తిచేయించాలి.

- చందర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



దామెర : ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర : విద్యా, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఊరుగొండలో రూ.20లక్షల ఎన్‌హెచ్‌ఎం నిధులతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా రాష్ట్ర అభివృద్ధి, విద్యా, వైద్యానికి ప్రాధాన్యమిస్తుందని అన్నారు. పల్లె దావాఖానాలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. అనంతరం వన మహోత్సంలో భాగంగా మొక్కలను నాటారు. జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల జిల్లాగా ప్రకటించాలి

పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల న్యాయవాదులు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరిని కలిసిన న్యాయవాదులు.. గతంలోనే ప్రతిపాదనలు చేసిన, ప్రస్తుతం జిల్లా కేంద్రంలో గల పరకాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కోసం ఐబీ శాఖకు సంబంధిత స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదే విధంగా పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. పరకాల బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేకల శ్రావణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి దొగ్గెల రమేశ్, పరకాల కోర్టు ఏజీపీ మేరుగు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది పున్నం రాజిరెడ్డి, న్యాయవాదులు కె.సురేశ్, పి.వేణు, ఎండీ. రఫీ, రాజు, సాయికుమార్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పరకాల : సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం చల్లగరిగె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గోవింద సత్యనారాయణ దంపతులను గురువారం పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో సన్మాన మహోత్సవం జరిగింది. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం సత్యనారాయణ దంపతులును సన్మానించారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

పరకాల : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల వార్డుల్లో నెలకొన్న పరిస్థితులపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా పదవులు అనుభవించి పార్టీ మారిన ద్రోహులను ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ పార్టీలోకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయే అన్ని ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడుతుందని జోస్యం చెప్పారు. ఈనెల5 నుంచి వార్డుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయాలని సీనియర్ నాయకులను ఆదేశించారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొంది పరకాల మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు అనుగుణంగా కమిటీల ఏర్పాటు ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, సారంగపాణి, రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీడీఓ గుండె బాబు



ఉల్లిగడ్డల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఉల్లిగడ్డలు పాడైపోయి కనిపించగా వార్డెన్ కట్టయ్యపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించి నాణ్యమైన ఉల్లిగడ్డలు కొనుగోలు చేయాలని సూచించారు. వసతుల గురించి ఆరా తీశారు. హాస్టల్ గదులు, టాయిలెట్లు, హాస్టల్ పరిసరాలను పరిశీలించి చెత్త తొలగించి హాస్టల్ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నీరు నిల్వకుండా మరమ్మతులు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విద్యార్థులకు వాలీబాల్, షటిల్ క్రీడల కోసం కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కాలం చెల్లిన వంట సామగ్రిని ఉపయోగించొద్దని అన్నారు.

ముమ్మరంగా 'ఇందిరమ్మ' నిర్మాణాలు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు మొదటి విడత బిల్లులు బ్యాంక్ ఖాతాల్లో జమకావడంతో నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు నిమగ్నమయ్యారు. గురువారం అమరగొండ మమత-సాంబరాజు లబ్ధిదారుడి ఇంటి దర్వాజ ఏర్పాటు చేయగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు వల్లపు రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు. మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజు, కృష్ణ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌కు యువత పాటుపడాలి

పరకాల : దేశ ప్రధాని నరేంద్ర మోదీని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధి, దేశ భవిష్యత్ కోసం యువత పాటుపడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ కోరారు. ఆయన జన్మదినం సందర్భంగా శివాజీ యువసేన ఆధ్వర్యంలో స్థానిక సివిల్ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు , బ్రెడ్స్ పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోని బ్లడ్ బ్యాంక్‌లో శివాజీ యువసేన సభ్యులు రక్తదానం చేశారు. శివాజీ యువసేనా నాయకుడు రాజేశ్, నర్సింగరావు, ఎండి.ఖాసీం, రాజ్‌కుమార్, అశోక్, అర్జున్, పున్నమానంద్, శివప్రసాద్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

పరకాల : కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని సకల కళల పరిరక్షణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ దేశ్ పాండే డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఫ్‌జే ఫంక్షన్ హాల్‌లో గురువారం కళాకారుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మురళీధర్‌దేశ్‌పాండే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులందరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు సౌకర్యం, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వేలేరు : ఆగస్టు 3న తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ 2వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సారంగపాణి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, కేటగిరిలను కొనసాగించాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని, కార్మికులను పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పీఆర్సీ పరిధిలోకి వేతనాలు తీసుకురావాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు వీరన్న, కిష్టయ్య, రాజలింగం, భాగ్యమ్మ, ప్రమీల, యాకూబ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

శాయంపేట : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. ఆగస్టు 3న జిల్లా కేంద్రాల్లో నిర్వహించతలపెట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం పెద్దకోడెపాక గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హతలేని డీఈఓలను తొలగించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ డీఈఓ, నూతన మండలాలకు ఎంఈఓలను నియమించాలని కోరారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సారయ్య, నాయకులు చంద్రయ్య, శ్రీరామ్, రాజారాం, రజనీకాంత్, విద్యాసాగర్, ఉపాధ్యాయులు రఘు, బాలాజీ, కవిత, రేణుకతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపునకు కట్టుబడి ఉండాలి

- ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ధర్మసాగర్ : వికలాంగుల పింఛన్ పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద పెండ్యాలలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వికలాంగులకు రూ.4,000 నుంచి 6,000, వృద్ధులు, వితంతువులు, గీత కార్మికుల, డయాలసిస్, హెచ్ఐవీ, కండరాల క్షీణత, ఆసరా పింఛన్‌దారులకు రూ.2,000 నుంచి రూ.4,000 పెంచాలని అన్నారు. ఈ మేరకు ఆగస్టు 7న హనుమకొండలో పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో సన్నాహక సదస్సు, ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో పింఛన్‌దారుల సింహగర్జన మహా సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు, వితంతులు, వికలాంగులు కొమురయ్య, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, బాబు, రాజయ్య, ముత్తయ్య, చంద్రయ్య, లక్ష్మీనారాయణ, నారాయణ, కార్తిక్, వెంకమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

దామెర : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం సింగరాజుపల్లి వికలాంగుల, వృద్ధుల, వితంతువుల నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బుర్ర యాదగిరి, అధ్యక్షులుగా వడ్డెపల్లి రాజు, తోట కొమురయ్య, ఉప్పుల సావిత్రి, ఉపాధ్యక్షులుగా సల్ల సదయ్య, కుమారస్వామి, రవీందర్, కార్యదర్శులుగా బాబురావు, సారంగపాణి, రజిత, వెంకటయ్య, కొమురయ్య, రాములును ఎన్నుకున్నారు.

సంక్షిప్తంగా

హైవేపై సూచిక బోర్డుల ఏర్పాటు



ఆత్మకూరు : మండల పరిధిలో 163 జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ఆత్మకూరు పోలీసుల ఆధ్వర్యంలో సూచిక బోర్డులను గురువారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పీర్ బాబా దర్గా సమీపం, పత్తిపాక క్రాస్‌రోడ్డు, నీరుకుళ్ల క్రాస్‌రోడ్, కటాక్షపూర్ వంతెన సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సంతోశ్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు పైపులైన్ ఏర్పాటు



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడు ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు నీటి కొరత తీర్చేందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చొరవతో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించి ఎంపీ లాడ్స్ నిధులు రూ.3.75 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సుదర్శన తిరునక్షత్రం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం సుదర్శన తిరునక్షత్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి సుదర్శన పెరుమాళ్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు.

ఏపీఎం దేవానంద్ బదిలీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల ఏపీఎం(అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్) గజ్జెల దేవానంద్ ధర్మసాగర్ మండలానికి బదిలీ అయ్యారు. పదేళ్లుగా భీమదేవరపల్లి మండలంలో విధులు నిర్వర్తించిన ఆయన.. డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషిచేశారు. ఆయన పరిధిలోని భీమదేవరపల్లి మండల సమాఖ్య రెండుసార్లు జాతీయస్థాయి అవార్డులు అందుకుంది. ఈ సందర్భంగా గురువారం కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీఓఏలు, మండల సమితి సభ్యులు, సిబ్బంది ఆయనకు శాలువాతో సత్కరించారు. కాగా భీమదేవరపల్లి ఏపీఎంగా వర్ధన్నపేట నుంచి వేణు బదిలీపై ఇక్కడికి రానున్నారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ చేసేందుకు ఆగస్టు 2న స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. 9 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏపీఎం శ్రీధర్‌రెడ్డికి సన్మానం



శాయంపేట : మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేసిన కొప్పుల శ్రీధర్‌రెడ్డి ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీధర్‌రెడ్డిని సమాఖ్య సభ్యులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సమాఖ్య అధ్యక్షురాలు గడిపే సుమలత మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీ సహజమని అన్నారు. ఏపీఎం శ్రీధర్‌రెడ్డి 10 ఏళ్లుగా శాయంపేట మండలంలో ఎనలేని సేవలందిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేఖ మండల సమాఖ్య కార్యదర్శి అమ్మ వసంత, కోశాధికారి కల్పనదేవి, సీసీలు కేదారి, విజయ్‌కుమార్, ప్రభాకర్, హేమలత, అకౌంటెంట్ అనిత, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వెలగటి ఆదిరెడ్డి, పసునూటి మల్లయ్య కుటుంబాలను గురువారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రవీందర్, నాయకులు అంకూస్ ఉన్నారు.